


నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

24 మంగళవారం నవంబర్ 2026 పేజీలు: 3

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



- **అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**

సత్యనిష్ఠం గరిడేపల్లి : భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం గరిడేపల్లి మండలంలో కాంపాటి రాజు మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలను కల్పించే గొప్ప ప్రజాస్వామ్య గ్రంథమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదం పొందగా, 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చిందని తెలిపారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవితాన్ని అందించేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించడం రాజ్యాంగ ప్రధాన లక్ష్యమని వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వపు హక్కును, ఆర్టికల్ 15 వివక్షకు వ్యతిరేకమైన హక్కును, ఆర్టికల్ 17 అంటరానితనం నిర్మూలనను తెలియజేస్తున్నాయని అన్నారు. అదేవిధంగా ఆర్టికల్ 19 భావప్రకటనా స్వేచ్ఛతో పాటు పలు స్వేచ్ఛలను, ఆర్టికల్ 21 జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తున్నాయని వివరించారు. సమాజంలోని అణగారిన వర్గాలు, దళితులు, పేదలు, బలహీన వర్గాలకు విద్య, ఉపాధి, సామాజిక న్యాయం అందించడంలో రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కులవివక్ష, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవడంతో పాటు పౌరులుగా తమ బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ నిర్వర్తించాలని తెలిపారు. దేశ సమగ్రతను కాపాడటం, జాతీయ ఐక్యతను పెంపొందించడం, ఇతరుల హక్కులను గౌరవించడం, సోదరభావంతో మెలగడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు బొజ్జ పరుశురాం మాదిగ, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు మీసాల మార్కండేయ, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కాంపాటి రాజు మాదిగ, ఓబీసీ మోర్చా నాయకులు కొప్పు లక్ష్మీనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా ఐటీ కన్వీనర్ అనంత్ గురవయ్య, బీజేపీ సీనియర్ నాయకులు చందా సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిరిపురంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన మహిళా సంఘ భవనం ప్రారంభం

- **కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి**

కోదాడ-నవంబర్ 23 (సత్యనిష్ఠ) కోదాడ నియోజక వర్గ పరిధి లోని నడిగూడెం మండలం సిరిపురం గ్రామంలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నీధులు రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనాన్ని కోదాడ శాసనసభ్యురాలు శ్రీమతి పద్మావతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాలు గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాల సమావేశాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు ఈ



భవనం ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, వివిధ గ్రామాల ముఖ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

గుడిపల్లిలో ఘనంగా మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ జన్మదిన వేడుకలు

- **సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు**
- **పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు**

దేవరకొండ, నవంబర్ 23 (సత్యనిష్ఠ): గుడిపల్లి మండల కేంద్రంలో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్ గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. మండల కేంద్ర సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అరవపల్లి సరిత నరసింహ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్ర యాదగిరి, మాజీ సర్పంచ్ మోపురి ఆంజనేయులు, గణపురం మాజీ సర్పంచ్ తోటకూరి పరమేష్, గుడిపల్లి గ్రామ ఉప సర్పంచ్ అరవపల్లి శ్రీనయ్య, వార్డు సభ్యులు ఎర్ర మహేశ్వరి రామలింగం, కత్తుల రమేష్, బోడ నాగరాజు, ఎర్ర వంశీకృష్ణ, గణపురం రాధిక



యాదగిరి, వట్టెపు శ్రీను, వడ్లపల్లి శ్రావణ్య శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బోడ లక్ష్మమ్మ, మాజీ ఉపసర్పంచ్ కొమిరి రాంబాబు, మలికిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జానపాటి వెంకటయ్య, గణపురం సైదులు, గణపురం యాదయ్య, పోలే వెంకట్ యాదవ్, బోర్రయ్య, జగదీశ్వర్ రెడ్డి, వట్టెపు శివ యాదగిరి, ఎర్ర సైదులు, ముత్తయ్య, యాదయ్య, విష్ణుమూర్తి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సునంద రైస్ మిల్లును తరలించాలిప్రజల ఆరోగ్యం కాపాడాలి

సత్యనిష్ఠ, గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ ప్రజలు సోమవారం జిల్లా కలెక్టర్, డీపీఓ, జిల్లా పౌరసరఫరాల అధికారి (డీసీఎస్ఓ)లను కలిసి సునంద రైస్ మిల్లును గ్రామానికి దూరంగా తరలించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. గరిడేపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 722, 704/5/1లో ఉన్న సునంద రైస్ ఇండస్ట్రీస్ ప్రజల నివాసాల మధ్య కొనసాగుతుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మిల్లు నుంచి వెలువడుతున్న దుమ్ము, ఊక ధూళి, శబ్ద కాలుష్యంతో చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా బాధితులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2020 నుంచి 2026 వరకు ఎన్నిసార్లు పోరాటాలు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ.22 కోట్ల విలువైన సీఎంఆర్ బియ్యం లెక్కల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే మిల్లుకు ట్రేడ్ లైసెన్స్ లేదని, ఫ్యాక్టరీ లైసెన్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ)కి సంబంధించిన అక్నాలెడ్జ్‌మెంట్ మాత్రమే ఉన్నాయని, వాటి రెన్యూవల్ విషయంలోనూ స్పష్టత లేదని



ఆరోపించారు. గ్రీన్ జోన్ అనుమతులతో హెవీ కెపాసిటీతో మిల్లును నిర్వహిస్తున్నారని విమర్శించారు. గ్రామసభ తీర్మానం, ట్రేడ్ లైసెన్స్ వంటి అవసరమైన అనుమతులు లేని మిల్లుకు తిరిగి అనుమతులు ఇవ్వవద్దని అధికారులను కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన జీవించే హక్కులో భాగంగా ప్రజలకు కాలుష్యరహిత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సునంద రైస్ మిల్లును తక్షణమే గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మిల్లును గ్రామానికి దూరంగా తరలించే వరకు తమ పోరాటం ఆగదని, అవసరమైతే హైకోర్టు, మానవ హక్కుల కమిషన్, లోకాయుక్తను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ కమిటీ ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రవి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆలంపల్లి శేఖర్, పిట్ట నాగార్జున, మచ్చ వేణు, పిట్ట నాగరాజు, మచ్చ విష్ణు, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

మజహర్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే విజయసింహారెడ్డి

- కోదాడలోని మజహర్ ఇంటికి వెళ్లి పరామర్శ
- వెంట పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



కోదాడ, నవంబర్ 23 (సత్యనిష్ఠ): తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, కోదాడ మున్సిపాలిటీ 26వ వార్డు బీఆర్ఎస్ పార్టీ వార్డ్ ఇన్‌చార్జ్ ఎండి మజహర్‌కు కాలికి గాయం అయినదని తెలుసుకొని, స్థానిక రోశమ్మ గారి వీధిలో గల ఎండి మజహర్ గారి ఇంటికి పరామర్శించడానికి తెలంగాణ తొలి దశ ఉద్యమకారులు, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ అధ్యక్షులు, కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్సీ పట్టభద్రుల పరిశీలకులు, మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు తిప్పన విజయసింహారెడ్డి గారు వచ్చి పరామర్శించడం జరిగింది. వారివెంట బీఆర్ఎస్ పార్టీ కోదాడ పట్టణ అధ్యక్షులు షేక్ నయీం, కోదాడ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉపేందర్ గౌడ్, 32వ వార్డు ఇన్‌చార్జ్ మాదాల ఉపేందర్ యాదవ్, చలిగంటి వెంకట్ తదితరులు ఎండి మజహర్‌ను పరామర్శించడం జరిగింది.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా సద్వినియోగం చేసుకోవాలి

- కోదాడ ఏఎంసి చైర్పర్సన్ తిరుపతమ్మ సుధీర్

కోదాడ - నవంబర్ 23 (సత్యన్నిష్ట) తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ జయంతి పురస్కరించు కొని అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ను ప్రజలందరూ సద్విని యోగం చేసు కోవాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ కోరారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రం లోని గ్రామ పంచాయతీ కార్యాలయం నందు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంను ఎంపీడీవో మల్సూర్ నాయక్, సర్పంచ్ దున్నా శ్రీనివాస్ లతో కలసి దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ



కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, ఉప సర్పంచ్ ఏలుగూరి నాగరాజు, వార్డు సభ్యులు దున్నా శ్రీకాంత్, దున్నా లింగయ్య, బాణాల సతీష్ కుమార్, కాసాని మాధవి గోపీనాథ్, షేక్ నాజీయా రియాజ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పందిరి వెంకటరెడ్డి, మాజీ సర్పంచులు గడ్డం మల్లేష్ యాదవ్, చిల్లంచర్ల సత్య నారాయణ కాంగ్రెస్ పార్టీ నాయకులు జూలూరి వీరాచారి, కాసాని శివకృష్ణ, పాలకి రంగయ్య, జిపిఓ కోటయ్య, అంగన్వాడీ టీచర్లు సవిత, స్వర్ణకుమారి, జూనియర్ అసిస్టెంట్ వంశి, పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలి

- విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల సమస్యలతో బాధితుల ఇబ్బందులు
- ఇళ్లు ఇచ్చినంత మాత్రాన బాధ్యత తీరదు, పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలి
- బీజేపీ సూర్యపేట జిల్లా ప్రవాస కన్వీనర్ జల్లా జనార్దన్ రావు

కోదాడ - నవంబర్ 23 (సత్యనిష్ట) కోదాడ మున్సిపాలిటీ పరిధి లోని బాలాజీ నగర్ డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ సూర్యపేట జిల్లా ప్రవాస కన్వీనర్ జల్లా జనార్దన్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బిజెపి నాయకులతో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించి తన సొంత ఖర్చులతో విద్యుత్ సామాగ్రిని కొనుగోలు చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు నాలుగు సంవత్సరాల



క్రితమే డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ, లబ్ధిదారులకు జరిగిన జాప్యం వల్ల ఇళ్లలోని విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు చోరీకి గురయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ఇళ్ల పట్టాలు పొందిన పేద కుటుంబాలు విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారాని పేర్కొన్నారు. మరో వైపు డ్రైనేజీ, మంచినీరు, రోడ్ల సమస్యలు కూడా వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు ఇచ్చినంత మాత్రాన బాధ్యత తీరదని, లబ్ధిదారులు గౌరవంగా, ఆరోగ్యంగా జీవించేలా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పేదలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తి సుబ్రహ్మణ్యం, శెట్టి సుధారాణి, భూక్య సైదమ్మ, శాంతమ్మ, డబల్ బెడ్ రూమ్ బాధితులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు మార్పు సమస్యకు పరిష్కారం

- సమస్యను పరిష్కరించిన బీఆర్ఎస్ 6వ వార్డు ఇన్‌చార్జ్ భూక్య రాంబాబు
- కృతజ్ఞతలు తెలిపిన మామిడి స్రవంతి



మిర్యాలగూడ, నవంబర్ 23 (సత్యనిష్ఠ): 6వ వార్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన మామిడి స్రవంతి రేషన్ కార్డు 12 సంవత్సరాల క్రితం సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండలం లింగాల గ్రామంలో మంజూరైంది. గత 10 సంవత్సరాలుగా ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నప్పటికీ, రేషన్ కార్డు పాత మండలంలోనే ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను మన రాంబాబు దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పెన్ పహాడ్ మండలం లింగాల గ్రామం నుంచి మిర్యాలగూడ పట్టణం 6వ వార్డు ఇందిరమ్మ కాలనీకి రేషన్ కార్డు మార్పిడి చేయించి ఈరోజు అందజేశారు. మామిడి స్రవంతి కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్‌నినో ప్రభావంపై ఆరుతడి కూరగాయల పంటల అవగాహన సదస్సు

- రైతులకు కూరగాయ మినీకిట్ల పంపిణీ
- పంట మార్పిడితో అధిక లాభాలు పొందాలని సూచన

తిరుమలగిరి సాగర్, నవంబర్ 23 (సత్యనిష్ఠ):సోమవారం ఎర్ర చెరువు తండా, నెల్లికల్, పిల్లిగుండ్ల తండ, గోడుమడక గ్రామాల్లో ఉద్యాన శాఖ తరపున రైతులకు కూరగాయ మినీకిట్ల ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది. ప్రస్తుత ఎల్ నినో సమస్యను ఎదుర్కునే దిశలో రైతులు పంట మార్పిడితో కూరగాయల సాగును చేసుకోవాలని అనుముల క్లస్టర్ ఉద్యాన అధికారి మురళి సూచించారు. ఏడు రకాల కూరగాయ విత్తనాలను కలిగిన మినీ కిట్స్ ప్యాకెట్స్‌ను రైతులకు అందించడం జరిగింది,



తక్కువ నీటితో కూరగాయలను సాగు చేసి రైతులు అధిక లాభాలు పొందాలని సూచించారు. అదేవిధంగా ఉద్యానవన శాఖ రాయితీలను ఉపయోగించుకుంటూ సాగు ఖర్చులను తగ్గించుకోవాలని కోరారు, నీటి కుంటల నిర్మాణం చేసుకొని నీటిని పొదుపుగా వాడుకొని సాగు చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు రమాత్ చిన్ని, వట్టాల శీను, జటావత్ సక్క, నేనావత్ పిక్లీ, అనుముల క్లస్టర్ ఉద్యాన అధికారి మురళి, ఉద్యాన విస్తరణ అధికారి జనార్దన్ రెడ్డి, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సాంఘం సత్యాగ్రహ దీక్ష

- **దీక్షలో పాల్గొన్న భీల్యా నాయక్**

దేవరకొండ, నవంబర్ 23 (సత్యనిష్ఠ): దేవరకొండ బస్టాండ్ ఆవరణలో బీసీ సంక్షేమ సాంఘం రాష్ట్ర కార్యదర్శి చితపల్లి శ్రీనివాస్ గౌడ్ గారి ఆహ్వానం మేరకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతవత్ భీల్యా నాయక్ గారు, బీసీ సంక్షేమ సంఘం దేవరకొండ నియోజకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్యాగ్రహ దీక్ష కార్యక్రమానికి విచ్చేసి ముందుగా స్థానిక డా. బీఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి దీక్ష ప్రాంగణానికి చేరుకొని, వారికి సంఘీభావంగా దీక్షలో పాల్గొన్నారు. అనంతరం భీల్యా నాయక్ గారు



మాట్లాడుతూ... గత 4 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ లు, ఫీజు రీయంబర్స్ మెంట్ లు వెంటనే విడుదల చెయ్యాలని, అలాగే దేవరకొండలో రాష్ట్ర ముఖ్యమంత్రి బీసీ ఆత్మ గౌరవ సభ ఏర్పాటు చేసి విద్యార్థులకు బీసీ సంక్షేమ హాస్టళ్లు, కళాశాలలకు సొంత భవనాలు ముఖ్యంగా బాలికలకు బీసీ సంక్షేమ ప్రీ మెట్రిక్ బాలికల హాస్టల్ మంజూరు చెయ్యాలని అన్నారు. రాష్ట్రంలో ఈ ప్రభుత్వం బీసీల పై కపట ప్రేమ మాని, సంక్షేమం కోసం కృషి చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఢిల్లీని ఆక్రమించండి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- **కార్మిక హక్కుల పరిరక్షణ కోసం తరలిరావాలి - సిఐటియు నేత కల్లూరి మల్లేశం పిలుపు**

పెద్దకందుకూరు, నవంబర్ 23 (సత్యనిష్ఠ): నాలుగు కార్మిక నియమావళులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 1, 2, 3 తేదీలలో ఢిల్లీలో జరిగే 'ఢిల్లీని ఆక్రమించండి' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు అఖిల భారత మండలి సభ్యులు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం పిలుపునిచ్చారు. సోమవారం పెద్దకందుకూరులో ప్రీమియర్ ఉద్యోగుల సంఘం సమావేశం అనంతరం గోడపత్రికను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్మిక



సంఘం, సమ్మె హక్కులను ప్రశ్నార్థకం చేస్తూ 8 గంటల పనిని 12 గంటలకు పెంచడం, నిర్ణీత కాల ఉద్యోగ విధానంతో ఉద్యోగ భద్రత లేకుండా చేయడం దోపిడీకి దారితీస్తుందన్నారు. నెలకు రూ. 42,000 కనీస వేతనం, రూ. 21,000 పింఛను, పథక కార్మికులకు భవిష్య నిధి, ఉద్యోగుల రాజ్య బీమా, సేవా బహుమతి, ధరల నియంత్రణ, పంటలకు కనీస మద్దతు ధర, రుణ విమోచన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రీమియర్ ఉద్యోగుల సంఘం సిఐటియు ప్రధాన కార్యదర్శి సి. హెచ్. రమేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సత్య నారాయణ, సిఐటియు నాయకులు జె. వెంకటేష్, పి. గణేష్, నగేష్, సురేందర్, స్వామి, శ్రీనివాస్ రెడ్డి, గంగయ్య, నరేష్, సురేష్, ఐలయ్య, అన్నపూర్ణ, లలిత, సులోచన, రఫీ, ప్రణీత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ డీఆర్ఓ ఆర్. దశరథ మృతి

- **గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన డీఆర్ఓ**
- **కలెక్టరేట్‌లో విషాదం, దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన అధికారులు**



నల్గొండ, నవంబర్ 23 (సత్యనిష్ఠ): నల్లగొండ డీఆర్ఓ ఆర్. దశరథ కొద్దిసేపటి క్రితం అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన డీఆర్ఓ దశరథ హఠాన్మరణంతో కలెక్టరేట్‌లో విషాదం నెలకొంది. విధి నిర్వహణలో నిబద్ధత కలిగిన అధికారిగా గుర్తింపు పొందిన ఆయన మృతి పట్ల ఉన్నతాధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు అధికారులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తెలంగాణ భవన్‌లో జన్మదిన సందడి

రవీంద్ర కుమార్‌కు ఘన సన్మానం



హైదరాబాద్, నవంబర్ 23 (సత్యనిష్ఠ): హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు మరియు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్ గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రవీంద్ర కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేయించి, ఆప్యాయంగా రవీంద్ర కుమార్ గారికి తినిపించి, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఆనంద సమయంలో జగదీశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ... రవీంద్ర కుమార్ గారు పార్టీకి అందిస్తున్న సేవలు, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్రను అభినందించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజా సేవలో మరింత కాలం కొనసాగాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటి రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భగత్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పల్లా ప్రవీణ్ రెడ్డి, కడారి అంజయ్య, బొడ్డు గోపాల్ గౌడ్ తదితరులు పాల్గొని రవీంద్ర కుమార్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సముద్రాల లక్ష్మమ్మ మృతి బాధాకరంభీల్యా నాయక్ నివాళి



సత్యనిష్ఠ, దేవరకొండ: దేవరకొండ టీ-న్యూస్ రిపోర్టర్ సముద్రాల వేణు గారి మాతృమూర్తి సముద్రాల లక్ష్మమ్మ గారి అకాల మరణ వార్త తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతవత్ భీల్యా నాయక్ గారు వేణు గారి ఇంటికి చేరుకొని, లక్ష్మమ్మ గారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వేణు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా సముద్రాల వేణుకి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో భీల్యా నాయక్ గారి వెంట కేతవత్ హరి నాయక్, శివ, జైపాల్ నాయక్, మాదగోని కృష్ణ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

జాతి జన గణనలో ఓబీసీ కాలమ్ చేర్చాల్సిందే

- **డిసెంబర్ 14న ఢిల్లీలో బీసీల రణభేరి**



హైదరాబాద్, నవంబర్ 23 (సత్యనిష్ఠ): జాతి జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలని, ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ కేటాయించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగమ్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుక్కలకు, పులులకు, మిగతా జంతువులకు లెక్కలు ఉంటాయి కానీ బీసీలకు లెక్కలు వద్దా అని బీసీ ప్రధాని నరేంద్ర మోడీ గారిని లింగం గౌడ్ ప్రశ్నించారు. జాతి జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చాలని కోరుతూ డిసెంబర్ 14న పెద్ద ఎత్తున రామ్ లీలా మైదానంకు తరలివచ్చి బీసీల రణభేరిని విజయవంతం చేయాలని జాజుల లింగం గౌడ్ బీసీలకు పిలుపునిచ్చారు. బీసీ కులగణన చెయ్యకపోతే బీజేపీకి పుట్టగతులు ఉండవని ఆయన హెచ్చరించారు.